సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 20-2-2025

సంపుటి: 20 సంచిక: 279

పేజీలు: 8 వెల: రూ.1

సమయం అర్థరాత్రి దాటింది, ఊరు ఊరంతా గాఢ నిద్రలో ఉంది.. ఇంతలో ఓ మండువా లోగిలి ఇంటిలో నుంచి ఓ పద్దెనిమిదేళ్ల అమ్మాయి చప్పుడు చేయకుండా గోడ దూకింది.. బయట ఓ కుర్రాడు సైకిల్ మీద రెడీగా ఉన్నాడు.. అమ్మాయి రాగానే గబుక్కున సైకిల్ ఎక్కించుకుని వాయువేగంతో తొక్కడం మొదలుపెట్టాడు..

కట్ చేస్తే.. కుర్రాడు కోయంబత్తూరు గుడిలో పిల్ల మెడలో తాళి కడతాడు..

కట్ చేస్తే.. పిల్ల తండ్రి కొంతమంది రౌడీలను వేసుకుని చేజింగ్ మొదలుపెడతాడు !లవంటి స్టోరీ అనుకుంటున్నారా? మొన్నటిదాకా సినిమాల్లో స్టోరీలు ఇలాగే ఉండేవి కదా!



## ఒకరి పెళ్లాం ఇంకొకరి మొగుడితో

# లేచిపోవడమే లేటెస్ట్ ఫ్యాషన్



- పరేష్ తుర్లపాటి

ఇప్పుడు స్టోరీలు మారిపోయాయి.. పెళ్లి కాని పిల్లలు లేచిపోవడం పాత స్టోరీలు. పెళ్లయిన అంకుల్స్.. పెళ్లయిన ఆంటీలు లేచిపోవడం కొత్త స్టోరీలు. అవును కొత్త స్టోరీలు పుట్టుకొస్తున్నాయి !

కొత్త స్టోరీ ఏంటంటారా?.. సమయం అర్థరాత్రి దాటింది.. ఊరు ఊరంతా గాఢనిద్రలో ఉంది.. సుబ్బారావుకు సడెన్‌గా మెలుకువ వచ్చింది.. పక్కలో చూసి ఉలిక్కిపడ్డాడు.. పక్కన ఉండాల్సిన భార్య లేదు.. సరిగ్గా అదే టైమ్‌కు వాట్సాప్ మోగింది.. సుబ్బారావు భార్య అప్పారావుతో లేచిపోయి కేక్ కటింగ్ చేసుకుంటున్న వీడియో కనిపించింది.. కింద టైటిల్.. 'అవును వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు.. 57తో 47 ప్రేమలో పడింది..'.

ఇదేంటి స్టోరీ డిఫరెంట్‌గా ఉంది అనుకుంటున్నారా? ఎంతసేపూ పాత చింతకాయ పచ్చడేనా? ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న స్టోరీలు కూడా చెప్పుకోవాలి కదా?

మొన్నటికి మొన్న మన నరేష్ పవిత్ర బంధం నుంచి ఈనాటి దువ్వాడ అడల్టరేషన్ స్నేహాలు సూపర్ ట్రెండింగ్ అవలేదూ? ఒకడి పెళ్లాం ఇంకోడి మొగుడితో లేచిపోవడమే లేటెస్ట్ ఫ్యాషన్ అయిపోయింది కదా! లేటు వయసులో కుటుంబాలను గాలికి వదిలేసి లేచిపోయే ముందు - మిగతా చివరి పేజీలో

# 400 మంది ఇళ్లు కొట్టేయమని ముందుకొచ్చారు

- కార్పొరేషన్ కార్యాలయమో, పంచాయతీ ఆఫీసో అర్థం కావడంలేదు
- రూ.40 కోట్లతో కాలువలన్నీ బాగుచేస్తాం
- న్యూకాలనీకి పాత వైభవాన్ని తీసుకొస్తాం
- ఎమ్మెల్యే గొండు శంకర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక రామలక్ష్మణ జంక్షన్ నుంచి డే అండ్ నైట్ వరకు 400 మంది రోడ్డుకు ముందు భాగంలో ఉన్న తమ ఇళ్లు కొట్టేసినా అభ్యంతరం లేదని రాతపూర్వకంగా వచ్చి తనను కలిశారంటే నగరంలో ట్రాఫిక్ సమస్య ఏమేరకు ఉందో అర్థమవుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో వినతులు స్వీకరించడం, నిలిచిపోయిన పనులను ప్రారంభించడంలో కాలం గడిచిపోయిందని, ఇప్పుడిప్పుడే ప్రాంతాల వారీగా అభివృద్ధి మీద దృష్టి సారిస్తున్నానని, అందులో భాగంగానే న్యూకాలనీవాసుల సంక్షేమ సంఘం ఏర్పాటుచేసిన సమావేశానికి వచ్చానన్నారు. స్థానిక అపెక్స్ బిల్డింగ్‌లో గురువారం న్యూకాలనీవాసులతో ఎమ్మెల్యే భేటీ అయ్యారు. కాలనీలో ప్రముఖులంతా ఇక్కడి సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారని, ఒక్క న్యూకాలనీలో మాత్రమే రోడ్లు, కాలువల సమస్య లేదని, నగరం మొత్తం రూపురేఖలు మార్చాల్సిన పరిస్థితి ఉందన్నారు. అమృత్ నిధులు రూ.40 కోట్లు ఖర్చు పెట్టి నగరంలో మురికి కాల్వలు బాగుచేయడానికి డీపీఆర్ తయారుచేసినట్లు ఆయన పేర్కొన్నారు. అసలు నగర కార్పొరేషన్ కార్యాలయమే పంచాయతీ ఆఫీస్ కంటే దారుణంగా ఉందని, వీటన్నింటినీ మార్చాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రామలక్ష్మణ జంక్షన్ నుంచి డే అండ్ నైట్ వరకు రోడ్డు వెడల్పు చేయడానికి రంగం సిద్ధమైపోయిందని, అదే సమయంలో ఇలిసిపురం నుంచి - మిగతా చివరి పేజీలో



# తత్వం బోధపడిందా సామీ!





- చాలాకాలం తర్వాత జగన్‌ను కలిసిన ధర్మాన
- బెట్టు వీడి పాలకొండ పయనం
- అధ్యక్షుడి మార్పు సంకేతమే కారణం
- చిన్ని పిలుపునకు స్పందించేవారేరీ?

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**"మరో రెండేళ్ల వరకు పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్ కాలేను.. ఇప్పుడు రోడ్డెక్కినా చేసేదేమీ లేదు.. కొన్నాళ్లు మీరు నడపండి.. లేదూ ఇన్‌ఛార్జిగా ఎవర్ని పెట్టినా పార్టీ ఇష్టం. నేనైతే ఇంత వేగం బయటకు రాలేను."** ఇదీ మాజీమంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు ధర్మాన ప్రసాదరావు 2024లో వైకాపా ఓటమి తర్వాత తన అనుచరులకు చెబుతున్న వ్యవహారం.

సీన్ కట్‌చేస్తే.. మాజీ రాజ్యసభ సభ్యుడు పాలవలస రాజశేఖరం ఇటీవల చనిపోవడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురువారం పాలకొండ వచ్చారు. ఈ సందర్భంగా జగన్‌ను కలిసేందుకు స్వయంగా ధర్మాన ప్రసాదరావే పాలకొండ వెళుతున్నారు. పార్టీ కష్టకాలంలో ఉందని, జిల్లాలో ధర్మాన యాక్టివ్‌గా లేకపోతే రాజకీయాలు చేయడం కుదరదంటూ స్వయంగా జిల్లా పార్టీ అధ్యక్షుడు, ధర్మాన సోదరుడు కృష్ణదాస్ దగ్గర్నుంచి మొన్నటికి మొన్న పార్టీనుంచి వెళ్లిపోయిన విజయసాయిరెడ్డి వరకు ఎంతోమంది ధర్మానను బతిమాలారు. కానీ పార్టీ వల్ల తాను నష్టపోయాను తప్ప, తన వల్ల పార్టీ నష్టపోలేదన్న భావనతో ఆయన ఇంతవరకు పార్టీ కోసం అడుగు బయటపెట్టలేదు. కానీ ఇప్పుడు జగన్‌ను కలవడానికి స్వయంగా ఆయన తన మందీమార్బలంతో వెళుతున్నారంటే.. కచ్చితంగా తెర వెనుక ఏదో జరుగుతోంది. ఆ వెనుక ఏమిటనేదే ఈ కథనం సారాంశం. శ్రీకాకుళంలో పార్టీ కార్యాలయ నిర్మాణంపై స్టే ఉండటంతో అంతవరకు అద్దె కొంపలో కార్యక్రమాలు నడపడానికి అనువైన భవనాన్ని చూడటానికి పక్క జిల్లా నుంచి బొత్స సత్యనారాయణ వచ్చారు కానీ, పక్కనే ఉన్న ధర్మాన ప్రసాదరావు మాత్రం వెళ్లలేదు. రెండున్నరేళ్ల వరకు తన ఊసు పట్టొద్దని ఆయన నేరుగానే చెప్పుకొచ్చారు. అందులో భాగంగానే గురువారం పాలకొండకు జగన్మోహన్‌రెడ్డి వస్తున్నారని, దీనికి కార్యకర్తలు తరలి రావాలంటూ ధర్మాన తనయుడు చిన్ని బుధవారం పిలుపునిచ్చారు. బహుశా ఈ పిలుపునకు నియోజకవర్గంలో - మిగతా చివరి పేజీలో

## ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్‌కు

# నలుగురు ఎన్నిక



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర కౌన్సిల్‌కు శ్రీకాకుళం జిల్లా నుంచి నలుగురు జర్నలిస్టులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దాదాపు 9వేల మంది సభ్యులు గల యూనియన్ రాష్ట్ర కౌన్సిల్‌కు, రాష్ట్రవ్యాప్తంగా 84మంది ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి డి.సోమసుందర్ బుధవారం ప్రకటించారు. రెండేళ్లపాటు వీరు ఈ పదవుల్లో ఉంటారు. శ్రీకాకుళం జిల్లా నుంచి బెండి నర్సింగరావు (టెక్కలి), కొంచాడ రవిశంకర్ (పలాస), జి. శ్రీనివాసరావు (పాతపట్నం), ఎంవి మల్లేశ్వరరావు (శ్రీకాకుళం) ఎన్నికయ్యారు. వీరి ఎన్నిక పట్ల ఐజేయు జాతీయ కార్యవర్గసభ్యులు నల్లి ధర్మారావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్. ఈశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, సనపల రమేష్ హర్షం వ్యక్తం చేశారు.






# సంపన్నులే పాలకులైతే..!

నిస్సిం మన్నథుక్కరెన్
(ఫ్రంట్‌లైన్ సౌజన్యంతో)
(తెలుగు అనువాదం కొందూరి వీరయ్య)

**తొ**లిసారి ట్రంప్ అధికారానికి వచ్చినపుడు ఎన్నికైన సెనెటర్లు అమెరికా చరిత్రలోనే అత్యంత సంపన్నులుగా రికార్డు సృష్టించారు. ట్రంప్‌ను రెండోసారి అధికారానికి తెచ్చిన 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచినవారు సైతం ఈ విషయంలో తమ రికార్డును తామే రద్దు చేసుకుని సరికొత్త రికార్డు సృష్టించారు. ప్రస్తుతం అమెరికా పార్లమెంట్ సభ్యుల ఉమ్మడి ఆస్తి విలువ 460 బిలియన్ డాలర్లు. వీరిలో 16మంది శతకోటీశ్వరులు. అమెరికా సంపదలో కేవలం 1 శాతం జనాభా చేతుల్లో 31 శాతం సంపద కేంద్రీకృతమై ఉంది.

అమెరికా ప్రజాస్వామ్య దేశమే. కాకపోతే కేవలం జనాభాలో 0.0001 శాతం ఉన్నవారు మొత్తం అమెరికన్ పౌరుల జీవితాలను, దేశ ఆర్థిక వ్యవస్థనూ ప్రభావితం చేసే విధానాలను రూపొందిస్తున్నారు.

2024 అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ఆ దేశంలోని అత్యంత సంపన్నకుటుంబాలు రెండు బిలియన్ డాలర్లు చందాలుగా ఇచ్చాయి. నయా కుబేరులు ఏకంగా ప్రభుత్వ పరిపాలనలోనే భాగస్వాములు అయితే అటువంటి వారి చేతుల్లో కేంద్రకృతమయ్యే రాజకీయాధికారికి ఉండే శక్తి అసామాన్యమైనది. ఉదాహరణకు ఎలన్ మస్క్ ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన కుబేరుడు అని తెలిసిందే. గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో ట్రంప్ తరపున ప్రచారం చేయటంతో పాటు 250 మిలియన్ డాలర్లు రిపబ్లికన్ పార్టీకి చందాగా ఇచ్చారు. ట్రంప్ అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఇప్పుడు మస్క్ ఏకంగా పాలనా సామర్థ్యపు విభాగాన్ని ఏర్పాటు చేయించుకుని మరీ దానికి అధినేతగా బాధ్యతలు చేపట్టారు.

ఆర్థికంగా అపరిమిత శక్తివంతులు రాజకీయ వ్యవహారాల్లో ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటే సంపద కేంద్రీకరణ, ప్రజాస్వామ్యం పరిణతిలపై ప్రతికూల ప్రభావం చూపుతారని పరిశోధనలు నిర్ధారించాయి.



### ప్రజలపై ఎటువంటి ప్రభావం ఉంటుంది?

ఒక వ్యక్తి కేవలం సంపన్నుడు అయినంత మాత్రాన ప్రభుత్వంలో (పరిపాలన నిర్వహణలో) భాగస్వామి కాకూడదు అని వాదించలేము. ఇక్కడ సమస్యల్లా ఏమిటంటే పరస్పర విరుద్ధ ప్రయోజనాలు. యావత్ దేశ జనాభా ప్రయోజనాలకు అవసరమైన విధానాలు, చట్టాలు రూపొందించే వారు ప్రజలకన్నా మితిమీరిన సంపన్నవంతులైతే అటువంటి చట్టాలు రూపొందించటానికి, ప్రజాహిత చర్యలు చేపట్టడానికి స్వతహాగానే విముఖతతో ఉంటారు. ఉదాహరణకు ప్రపంచంలో పెరిగిపోతున్న ఆర్థిక అంతరాలు తగ్గించాలంటే సంపద పన్ను, వారసత్వ పన్ను విధించాలని ఐక్యరాజ్యసమితి మొదలు అంతర్జాతీయ మేథో సంస్థలన్నీ ప్రతిపాదిస్తున్నాయి. కానీ నయానో భయానో అధికారానికి ఎగబాకి దేశ ప్రజల తలరాతలు మార్చే బాధ్యతల్లో (అధికారంలో) ఉన్న మస్క్ లాంటి వ్యక్తులు ఇటువంటి చట్టాలను అంగీకరించరు కదా. దీన్నే పరస్పర విరుద్ధ ప్రయోజనాలు అంటారు. (కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంటరెస్ట్).

వాణిజ్య నైతికతలు, తమ వ్యాపారాలు, ప్రభుత్వ వ్యవహారాల మధ్య ఉన్న సంబంధాన్ని బహిరంగపర్చాలన్న చట్టాలు మిగిలిన దేశాల్లో కంటే అమెరికాలోనే ఎక్కువగా ఉన్నాయి.

ట్రంప్ ప్రభుత్వంలో వాణిజ్య మంత్రి (అమెరికా పరిపాలనా భాషలో కార్యదర్శి అంటే మనం ఇక్కడ సదరు శాఖా మంత్రిగా అర్థం చేసుకోవచ్చు) ద్రవ్య సేవలందించే ఓ ప్రైవేటు కంపెనీ యజమాని. నాసా సంస్థ బాధ్యతల్లోకి వచ్చిన వ్యక్తి ప్రైవేటు రంగంలో అంతరిక్ష పరిశోధనలు చేపట్టి రోదసీ యాత్రలు నిర్వహిస్తున్న వ్యక్తి. శ్వేత సౌధంలో కృత్రిమ మేథ, క్రిప్టో కరెన్సీ విభాగాల పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టిన వ్యక్తి పేపాల అనే ఆన్‌లైన్ చెల్లింపుల సంస్థలో ఉన్నత స్థాయి ఉద్యోగిగా పని చేశారు.

మార్కెట్ ప్రయోజనలకూ, ప్రజాప్రయోజనాలకూ మధ్య మౌలికమైన వైమనస్యం (వైరుధ్యం) ఉంది. ఓ పరిశోధకుడు ప్రశ్నించినట్లు 'రోజుకు 14 మిలియన్ డాలర్ల ఆదాయం సంపాదించే వ్యక్తికి లక్షలాది మంది అమెరికా పౌరులకు అందే 197,600 డాలర్ల సామాజిక భృతి విలువ అర్థమవుంతా?'

ప్రస్తుతం అమెరికా వార్షిక బడ్జెట్ 6.75 ట్రిలియన్ డాలర్లు. ఇందులో రెండు ట్రిలియన్ డాలర్ల మేర కోత విధిస్తామని మస్క్ ప్రకటిస్తున్నారు. పరిపాలనా సామర్థ్యాన్ని పెంచేందుకు ఓ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసి ఆయన్ను దీనికి బాధ్యుడిగా నియమించిన విషయాన్ని ముందే చెప్పుకున్నాము. అంటే ఇటువంటి వారి దృష్టిలో పరిపాలన సామర్థ్యం అంటే ప్రజలకు మెరుగైన సేవలందించటం కాదు. పౌరసేవలను నిలిపివేయటం అన్నమాట. కానీ మస్క్ ఏమంటున్నారు? బడ్జెట్ కోతల వలన స్వల్పకాలంలో కొంతమందికి అసౌకర్యం కలగవచ్చు అంటున్నారు. మొత్తం దేశంలో అయ్యే ఖర్చులో మూడోవంతు ఖర్చు కోతకోయటం స్వల్పకాలిక అసౌకర్యమా? ఆ బడ్జెట్ వనరుల ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందేవారికి ఆ ప్రయోజనం దక్కకపోవటం వలన కలిగే బాధ వర్ణణాతీతం.

అమెరికా ప్రభుత్వంలో వివిధ విభాగాలు ఎలన్ మస్క్‌కు దాదాపు వంద కాంట్రాక్టులు ఇచ్చాయి. వీటిపై 11 నిఘా విభాగాలు దర్యాప్తు చేస్తున్నాయి. ఆయా దర్యాప్తు విభాగాల్లో అధికారులపై ట్రంప్ ప్రభుత్వం వేసిన వేటు కారణంగా అమెరికా ప్రభుత్వానికీ, మస్క్‌కు మధ్య జరిగిన 30 వివాదాస్పద ఒప్పందాలపై జరుగుతున్న దర్యాప్తులు నిలిచిపోతాయి.


పన్నులు, ఆర్థిక నియంత్రణలు, సామాజిక సంక్షేమ చర్యలు వంటి అనేక అంశాల విషయంలో అమెరికాలోని ఒక శాతం సంపన్నుల అభిప్రాయాలకూ, సాధారణ ప్రజల అభిప్రాయాలకూ మధ్య పొసగని తేడాలున్నాయని పరిశోధకులు గుర్తు చేస్తున్నారు. 85 శాతం సాధారణ ప్రజలు ప్రభుత్వమే ప్రాథమిక విద్యాభ్యాస భారాన్ని మోయాలని కోరుకుంటుంటే సంపన్నులైన ఒక్క శాతం జనాభా మాత్రం అటువంటిదేమీ అవసరం లేదనీ, ఎవరి కాళ్ల మీద వాళ్లే నిలబడాలనీ వాదిస్తున్నారు.

ప్రజోయోగ విధానాల రూపకల్పన బాధ్యతలు సంపన్నుల చేతిలో బంధీ అయినప్పుడు కలిగే ఫలితాలు అత్యంత దారుణంగా ఉంటాయి. ఎన్నికల ప్రచారంలో ట్రంప్ 'డ్రిల్, బేబీ, డ్రిల్' అని నినాదమిచ్చారు. అంటే ప్రకృతినరులు ప్రత్యేకించి ఇంధనవనరులకు అనుకూలంగా ఉండే విధానాలే తన విధానాలు అని చెప్పటానికి ఆయన ప్రచార వ్యూహకర్తలు - మిగతా చివరి పేజీలో

• ఎడిటోరియల్

# అవినీతి సర్వాంతర్యామి..!

అవినీతి ప్లేగ్ వ్యాధికంటే భయంకరంగా వ్యాపిస్తోంది. అది దేశంలోని అన్ని అంగాలకు సోకింది. ఇప్పుడది ప్రభుత్వాన్నే శాసిస్తోంది. అది చెప్పినట్టుగా పాలకులు తలలూపాల్సి వస్తోంది. తమ గురువులకు కావాల్సిన పనిని అవినీతి భూతం చేయించిపెడుతోంది. తాజాగా ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ విడుదల చేసిన 2024 అవినీతి భావన సూచిక కూడా ఇదే రుజువు చేసింది. అవినీతిలో భారతదేశం 180 దేశాలతో పోలిస్తే 96వ స్థానంలో ఉంది. దేశంలో అవినీతి ర్యాంక్ 1995 సంవత్సరం నుంచి 2024 వరకూ సగటున 78.03గా ఉంది. అది 2024లో గరిష్ట స్థాయికి.. అంటే 96.00కి చేరింది. 1995లో ఈ ర్యాంక్ 35.00గా ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతీయుల ప్రభ వెలిగిపోతున్నదనీ, విశ్వగురుగా అవతరించిందనీ సుప్రభాత గీతాలతో మేల్కొంటున్నాం. అవినీతిని, నల్లధనాన్ని తరిమికొట్టడమే లక్ష్యంగా మోదీజీ మహత్తర విజయాలు సాధించారని ఒకవైపు కీర్తిస్తుంటే.. ఈ సూచిక వివరణ భిన్నంగా ఉంది. అసలు అవినీతిపై ఇంతగా సమరం చేస్తున్నాను గనకే తనను ప్రత్యర్థులు వేటాడుతున్నారనీ ఆయన చేసిన భావోద్వేగ ప్రకటనలతో భజనపరులు బాధపడిపోతుంటారు. అవినీతిని అరికడతాం.. పూర్తిగా రూపుమాపుతాం అని మోదీ 2014లో చెప్పినా, ఇప్పుడు మాట్లాడుతున్నా అసలు ఆపింది లేనే లేదు. ఇంతచేస్తే పై స్థాయిలో అవినీతిని ఎందుకు అరికట్టలేకపోతున్నారంటే సమాధానం ఉండదు. ఒకవేళ తమకు రాజకీయంగా ఇబ్బందులు వచ్చినప్పుడు, అవినీతికి ప్రజలు వ్యతిరేకంగా తిరగబడుతున్న సమయంలో రాజకీయ ప్రత్యర్థులపై ఆరోపణలు చేసేసి తప్పుకుంటారు. పెద్దనోట్ల రద్దు సమయంలో ఇలానే జనాన్ని రోడ్లపై నెట్టేసి అవినీతిపరులకు ఏ రకంగా ద్వారాలు తెరిచింది చూశాం. అవినీతిని అడ్డుకోవడం ప్రస్తుత పాలకులకు ఇష్టం లేదు. మరింత పెంచి పోషిస్తూ రాజకీయ పబ్బానికి వాడుకోవడమే బీజేపీ ప్రభుత్వానికి కావాల్సింది. అవినీతి, కార్పొరేట్లు, మతం ఈ మూడింటితోనే దేశ రాజకీయాలను, ప్రభుత్వాన్ని, రాష్ట్రాలను మోదీ ప్రభుత్వం శాసిస్తోంది. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, అస్మదీయులకు ప్రజాసంపదను దోచిపెట్టడంలో గత ప్రభుత్వాల కంటే బీజేపీ ప్రభుత్వం మించిపోయింది. తమకు మేలు చేసిన వారి అవినీతి కుంభకోణాలు బయటపడినా వారికి అండగా నిలబడింది. వందలు, వేల కోట్ల రూపాయల కుంభకోణాలు బయటకొచ్చినా విజయమాల్యా, నీరవ్‌మోదీ లాంటి దొంగలను దగ్గరుండి దేశం దాటించింది. బీజేపీ నేతలు ప్రభుత్వ రంగాలను పూర్తిగా అనిల్ అంబానీ, గౌతమ్ అదానీ వంటి పెద్ద పెద్ద పెట్టుబడిదారులకు దగ్గరుండి దోచిపెడుతున్నారు. అనేక చోట్ల అవినీతి జరిగిందని తేలినా చర్యల్లేవు. అవినీతికి దూరంగా ఉండాలని మోదీ చెబుతారు. కానీ తమ హయాంలో జరుగుతున్న అవినీతి కుంభకోణాల గురించి మాత్రం పెదవి విప్పరు. ఎన్నికల బాండ్ల రూపంలో కార్పొరేట్ల నుంచి అత్యధికంగా విరాళాలు పొందింది బీజేపీనే. ఆ విషయంలో మరే పార్టీ దరిదాపుల్లోకి లేదు. ఆ డబ్బు అంతా అవినీతికరమైనదే. ఆ డబ్బుతోనే ప్రతిపక్షపార్టీల ప్రజాప్రతినిధులను కొనుగోలు చేయడం, ప్రభుత్వాలను పడకొట్టడం చేసింది. ఎన్నికల బాండ్లను వ్యతిరేకించిన ఏకైక పార్టీ సీపీఐ(ఎం) మాత్రమే. విరాళాలు అందించిన కార్పొరేట్ సంస్థలకు మోదీ లబ్ధి చేకూర్చారు. రైతుల రుణాలు మాఫీ చేయడానికి చట్టం వర్తించదు. అదే కార్పొరేట్లు నష్టపోతే వారి బ్యాంకు రుణాలను ఒక్క కలం పోటుతో రద్దు చేశారు. విమానాల కుంభకోణం, బొగ్గు, విద్యుత్ అవినీతి.. ఇలా ఎన్ని బయటపడినా మోదీ పాలనలో అవినీతి సర్వసాధారణం అయింది. అంతర్జాతీయంగా మోదీ ఆప్తుడైన అదానీ అవినీతి భాగోతం అమెరికాలో బయటపడినా ఆయన పరివారం పెదవి మెదపలేదు. పైగా ఆయనపై కేసు లేకుండా చేయడం కోసం అమెరికా అధ్యక్షుడిని ప్రభావితం చేసి ఆ దేశంలోని విదేశీ అవినీతి కార్యకలాపాల చట్టం అమలును నిలిపివేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ట్రంప్ కూడా పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారి కావడంతో అదానీ అవినీతి పై మాట్లాడేందుకు నిరాకరించారు. ప్రత్యర్థుల మీద ఏ చిన్న ఆరోపణలు వచ్చినా ఈడీ, సీబీఐ వంటి ప్రభుత్వ సంస్థలను ప్రయోగించి మోదీ ప్రభుత్వం ఇబ్బందుల పాలు చేస్తోంది చూస్తూనే ఉన్నాం. అవినీతి విషయంలో సీరియస్‌గా లేకుంటే, దేశాభివృద్ధిని దెబ్బతీయడమే కాకుండా ప్రజాస్వామ్య విలువల క్షీణత, అస్థిరత, మానవ హక్కుల ఉల్లంఘనలకు కారణమవుతోందని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. స్వచ్ఛమైన పాలన, అవినీతి రహితమైన పాలన అని గొప్పలు చెప్పుకోవడం తప్ప పేరుకుపోయిన అవినీతిని అరికట్టకపోగా కార్పొరేట్ల అనుబంధంతో మరింత అవినీతికి ఆస్కారం ఇస్తున్న ప్రభుత్వంగా మనముందు నిలబడింది. పెరుగుతున్న అవినీతి దేశాభివృద్ధికి ఆటంకంగా మారింది.



# ఎవరీ రేఖాగుప్తా?

## అసెంబ్లీలో తొలి అడుగే ముఖ్యమంత్రిగా..

ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి పీఠంపై ఎవరనే చర్చకు భారతీయ జనతా పార్టీ తెరదించింది. కొంత తర్జన భర్జన, మీమాంస తర్వాత.. ఏకంగా మొట్టమొదటిసారి ఎమ్మెల్యేగా ఎంపికైన రేఖాగుప్తాను బీజేపీ ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రకటించడం విశేషమైతే.. మొట్టమొదటిసారిగా ఎమ్మెల్యేగా గెల్చిన రేఖ అసెంబ్లీలోకి తొలి అడుగే ముఖ్యమంత్రిగా పెట్టడం మరో విశేషం. 70మంది సభ్యుల ఢిల్లీ అసెంబ్లీలో 48 స్థానాలను గెల్చుకుని సుమారు 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో అధికారంలోకొచ్చిన బీజేపీ కొత్త ముఖ్యమంత్రిత్వంపై అపసోపాలే పడింది. కానీ, చివరకు ఓ మహిళను ముఖ్యమంత్రిగా ప్రకటించింది. దీంతో ఢిల్లీనేలే నాల్గో సీఎంగా ఇప్పుడు రేఖాగుప్త వార్తల్లోకెక్కింది. సుష్మాస్వరాజ్, షీలాదీక్షిత్, అతీశి తర్వాత.. నాల్గో ముఖ్యమంత్రిగా మళ్లీ మహిళనే ప్రకటించి బీజేపీ అందరి ఉహాగానాలను తలకిందులు చేస్తూ కొంత ఆశ్చర్యపర్చింది. రవిశంకర్ ప్రసాద్, ఓం ప్రకాష్ ధన్ఖర్ పరిశీలకులుగా నిర్వహించిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో గుప్తా పేరును ప్రకటించారు.

**రేఖా గుప్త ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘ మాజీ అధ్యక్షురాలిగా, ప్రధాన కార్యదర్శిగానూ పనిచేశారు. ఢిల్లీలోని మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా, పార్టీ జాతీయ కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలిగా కూడా పనిచేసిన అనుభవముంది. రాష్ట్రీయ స్వయంసేవక్ మెంబర్‌గానూ పనిచేశారు.**

1992లో ఢిల్లీ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలైన దౌలత్ రామ్ కాలేజీలో అఖిల భారతీయ విద్యార్థీ పరిషత్ కార్యకర్తగా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు రేఖ. 1996–97లో ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం (డీయుఎస్యూ) అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. అక్కడ ఆమె విద్యార్థుల సమస్యల పట్ల చురుకుగా స్పందించిన తీరు.. ఆమె రాజకీయ ప్రయాణంలో కలిసొచ్చింది.

**మున్సిపల్ కార్పొరేటర్ నుంచి ముఖ్యమంత్రి వరకు!**

జస్ట్ లైక్ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ లాగానే రేఖాగుప్తా ప్రయాణమూ కనిపిస్తుంది. సామాన్య కార్యకర్తగా, కార్పొరేటర్‌గా సంజయ్ ఏ విధంగానైతే తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి ఈరోజు కేంద్రమంత్రి వరకూ ఎదిగారో అదే పద్ధతిలో రేఖా గుప్తా కూడా ఒక మున్సిపల్ కార్పొరేటర్ నుంచి ముఖ్యమంత్రి వరకూ ఎదిగారు.

2007లో ఉత్తర పింతపుర నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికైన రేఖా గుప్తా లైబ్రరీలు, పార్కులు, స్విమ్మింగ్‌పూల్స్ వంటివాటి ఏర్పాటులో నాడు కీలకపాత్ర పోషించారు.

ఆ తర్వాత తిరిగి 2012లోనూ ఆమె కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత దక్షిణ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఎన్నికయ్యారు. అలా తన పాలనా అనుభవాన్ని ఎప్పటికప్పుడూ పెంచుకున్నారు రేఖ.

ఆర్థిక వెనుకబాటుకు గురైన మహిళా విద్యార్థినులు ఉన్నత విద్యను అభ్యసించే విషయంలో వారికి సాయపడటానికి ఆమె సుమేధ యోజన అనే ఓ పథకాన్ని ప్రారంభించి అందరి ప్రశంసలూ అందుకున్నారు. మహిళా సంక్షేమం, శిశు అభివృద్ధి కమిటీల్లోనూ కీలక పాత్ర పోషించారు. అణగారిన వర్గాల పాలిట నిలవడం, మహిళల కోసం పోరాటం చేస్తున్న రేఖా గుప్తా శైలే ఆమెను ఆర్ఎస్ఎస్ ను, బీజేపీ అధినాయకులను ఆకట్టుకునేలా చేసింది. ప్రజల కోసం పనిచేయాలనే మోటా రేఖా గుప్తా ఫ్యామిలీలోనే ఉండటంతో ఆమె రాజకీయాల్లో మరింత చురుకుగా రాణించారు. దాంతో విభిన్న బాధ్యతలనూ సమర్థవంతంగా పోషించి అందరి దృష్టినీ ఆకర్షించారు.



రేఖ కుటుంబీకులు మార్కెట్ కమీషన్ ఏజెంట్లుగా పనిచేసేవారు. భర్త ఢిల్లీలో స్పేర్ పార్ట్స్ వ్యాపారి. కూతురు ఆయనకు తోడుగా వ్యాపారం చూసుకుంటుంది. స్వస్థలం హర్యానాలోని నందిగడ్. మొన్నటి 2025 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో వాయువ్య షాలిమార్ బాగ్ నియోజకవర్గం నుంచి 68 వేల 200 ఓట్లు సాధించి.. 29 వేల 595 ఓట్ల మెజార్టీతో ఆప్ అభ్యర్థి బంధన కుమారిపై గెల్చారు. రేపు న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఆమె ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, ఇతర బీజేపీ అగ్రనేతల సమక్షంలో ఢిల్లీ నాల్గో మహిళా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు.

**- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...**




# సినిమాకు బలం!

## మంచి కథే..

**1982 ఏప్రిల్లో వచ్చిన ఈ డాక్టర్ సినీయాక్టర్ సినిమా చూసినప్పుడల్లా ఇద్దరు మిత్రులు, రాముడు-భీముడు సినిమాలే గుర్తుకొస్తాయి. అంత గొప్పగా నటించారు కృష్ణ. మూడు పాత్రల్లోనూ గొప్పగా నటించారు. మేనత్త మేనమామల పిల్లలుగా ఒకేలా ఉండేలా కథను నేయడమే సినిమా సక్సెస్‌కు సగం కారణం. కథ బిగువుగా ఉంటే చేసే షోకులు అన్నింటికీ విలువ వస్తుంది. ఈ సినిమా విజయానికి ప్రధాన కారణం పినిశెట్టి వ్రాసిన కథే. రొటీన్ కథలకు భిన్నంగా కొత్తగా వ్రాసారు.**

అందుకు తగ్గట్టుగానే విజయనిర్మల బిగ్రయిన స్క్రీన్‌ప్లే, దర్శకత్వాన్ని వహించారు. ఆత్రేయ డైలాగులు కూడా బాగుంటాయి. ఈ సినిమాలో మరో విశేషం ఛత్రపతి శివాజీ ఏకపాత్రాభినయం. యన్టీఆర్, కృష్ణలకు కొన్ని కామన్ అభిలాషలు ఉన్నాయి. వాటిల్లో ఒకటి కొన్ని పౌరాణిక, చారిత్రాత్మక పాత్రల మీద మక్కువ. ఆ మక్కువను ఎలాగోలా తీర్చేసుకుంటూ ఉంటారు. ఈ సినిమా ద్వారా కృష్ణ శివాజీ పాత్ర మీద మక్కువను తీర్చేసుకున్నారు. ఈ పాత్రకు కొండవీటి వెంకట కవి ప్రత్యేకంగా డైలాగులు వ్రాయటం విశేషం.

సినిమాల్లో సినిమాలు, నటీనటుల్ని చూడటం ప్రేక్షకులకు భలే ఇష్టం. పద్మనాభం దేవతతో మొదలయిన ఈ ప్రయోగం తెలుగులో చాలా సినిమాల్లో ప్రేక్షకాదరణ పొందింది. ఈ సినిమాలో ఒక కృష్ణ సినీయాక్టర్ కావటం వలన కొన్ని సినీ క్లిప్పింగులు, సినిమా వాళ్ళను చూపటం సెట్టయింది. యన్టీఆర్, దాసరి, శోభన్‌బాబు, గీత, నాగేషులు తళుక్కుమంటారు. ఈ సినిమా నిర్మాత తోట సుబ్బారావు కూడా చాలా సేపు నిర్మాత అవతారంలోనే కనిపిస్తారు.

పండంటి కాపురం సినిమా ద్వారా తెరకు పరిచయమైన జయసుధ మొదటిసారి కృష్ణ సరసన హీరోయినుగా నటించింది. బాగా నటించింది. జయసుధ చెల్లెలు సుభాషిణి, కవిత, మమత, అల్లు రామలింగయ్య, పుష్పకుమారి, రవికాంత్, కాంతారావు, నరసింహరాజు, సత్యనారాయణ, కాకినాడ శ్యామల, సీహెచ్ కృష్ణమూర్తి ప్రభృతులు నటించారు. చక్రవర్తి సంగీత దర్శకత్వంలో పాటలన్నీ శ్రావ్యంగా ఉంటాయి. వేటూరి, అప్పలాచార్య వ్రాసారు.

కృష్ణకు ఇది 190వ సినిమా. ఇప్పటి తరం హీరోలు వంద కూడా





కొట్టేలా లేరు. వీళ్ళ కెరీర్ ప్లానింగులేమిటో జనానికి అంతుపట్టదు. ఇంతకుముందు చూసి ఉన్నా మళ్లీ చూడొచ్చు. ఎంటర్టయినింగుగా ఉంటుంది. హుషారుగా సాగుతుంది. ఒకటి రెండు చోట్ల సాగతీత ఉంటుంది. మళ్లీ వెంటనే పుంజుకుంటుంది. కృష్ణ అభిమానులకు అప్పట్లో ఈ సినిమా పండగే పండగ.



మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన కేట్‌శర్మ చిత్ర పరిశ్రమలో విజయవంతమైన నటిగా కొనసాగుతోంది. దీంతోపాటు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన ఫోటో షూట్‌లను అప్‌డేట్ చేస్తుంటుంది. ఇటీవల ఆమె విడుదల చేసిన చిక్ దుస్తులతో ఉన్న ఫోటోషూట్ ట్రెండింగ్‌గా మారుతోంది. ఈ ఫోటోలో ఆమె సూర్యకాంతిని ఆస్వాదిస్తున్నట్టుగా అనిపిస్తోంది. కేట్ శర్మ రూహ్‌దార్, మేరీ దుర్గ మరియు తు మేరీ జిందగి చిత్రాలలో నటించింది. కెరీర్‌పరంగా కేట్ శర్మ తదుపరి ఏ పాత్రలో కనిపించనుందో స్పష్టత లేదు.

# ప్రభాస్ మూవీలో అనుపమ్ ఖేర్!!



మ్యాసీవ్ బ్లాక్‌బస్టర్స్ సలార్, కల్కి 2898 ఏడీ తర్వాత రెబల్‌స్టార్ ప్రభాస్ ప్రస్తుతం క్రియేటివ్ డైరెక్టర్ హను రాఘవపూడితో ఓ ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ కోసం కొలాబరేట్ అయ్యారు. ప్రముఖ పాన్–ఇండియా స్టూడియో మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం లార్జర్ దెన్ లైఫ్ ఎలిమెంట్స్‌తో విజువల్ వండర్‌గా ఉండబోతోంది. లేటెస్ట్ అప్‌డేట్ ఏమిటంటే, ఈ చిత్రంలో బాలీవుడ్ లెజెండ్ అనుపమ్‌ఖేర్ చాలా ముఖ్యమైన పాత్ర కోసం ఎంపికయ్యారు. ఈ వార్తను ఆయన స్వయంగా షేర్ చేశారు. గొప్ప పాత్రలు చేయడంలో పేరుపొందిన అనుపమ్, ఈ సినిమా స్క్రిప్ట్‌ను "అద్భుతం" అని అన్నారు. ప్రభాస్‌తో స్క్రీన్ స్పేస్‌ను పంచుకోవడానికి ఉత్సాహంగా వున్నారు. దర్శకుడు హను రాఘవపూడి ప్రతిభను కూడా ఆయన ప్రశంసించారు. "ఇండియన్ సినిమా బాహుబలి ప్రభాస్‌తో నా 544వ చిత్రాన్ని ప్రకటించినందుకు ఆనందంగా ఉంది. ఈ చిత్రానికి అద్భుతమైన ప్రతిభావంతులైన హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీవారు కూడా ఈ చిత్రాన్ని అద్భుతంగా నిర్మిస్తున్నారు" అని అనుపేమ్ ఖేర్ షేర్ చేశారు

## మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద, రజకులకు ఇచ్చే దోబీలు ,బ్రాహ్మణులకు ఇచ్చే స్థలాలను గురువారం స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి ఉండే మౌలిక సదుపాయాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రజక వృత్తుల వారికి కేటాయించిన దోబీలకు, బ్రాహ్మణులకు ఇచ్చే స్థలాలకు రహదారి సౌకర్యాలు కల్పించనున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో పారిశుధ్యం మెరుగుపరచే విధంగా చర్యలు తీసుకుంటామని, సమస్యను గుర్తించి వాటి పరిష్కరించే విధంగా ముందుకు వెళ్తామని అన్నిరకాల సదుపాయాలు వీరికి కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## స్వామ్నా జిల్లా అధ్యక్షుడికి పరామర్శ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చిన్న, మధ్య తరహా వార్తాపత్రికల సంఘం ( స్వామ్నా) జిల్లా అధ్యక్షులు కుంచె చిన్నారావు మాతృమూర్తి మరణానికి జిల్లా జర్నలిస్టు నాయకుల బృందం గురువారం ఉదయం నివాళులు అర్పించింది. జలుమూరు మండలంలోని అక్కురాడ గ్రామంలోని చిన్నారావు నివాసానికి వెళ్లి సంతాపం ప్రకటించింది. దళిత కుటుంబానికి చెందిన తమ బిడ్డలను వివిధ రంగాల్లో ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో తల్లిగా ఆమె పాత్రను కుటుంబ సభ్యులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ ఈశ్వరరావు, స్వామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంవి మల్లేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లారెడ్డి కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



## ఖాదీని సందర్శించిన గీతంవర్శిటీ విద్యార్థులు

(సత్యంన్యూస్, పొందూరు)

ఆంధ్ర సన్నఖాదీ కార్మికాభివృద్ధి సంస్థను(ఎ.ఎఫ్.కె.కె) గీతం యూనివర్సిటి స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ తొలి ఏడాది విద్యార్థులు బుధవారం సాయంత్రం సందర్శించారు. కుటీర పరిశ్రమల్లో పనిచేసే వృత్తి పనివారలకు గృహ నిర్మాణం ఏ విధంగా ఉండాలి, మగ్గానికి అనువుగా స్థలాన్ని ఎలా కేటాయించాలి తదితర అంశాలను జాగృతం చేసేందుకై వారంతా ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు ఖాదీ సంస్థ వర్క్ షెడ్డును, కార్మికుల గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సన్నఖాదీ నేత వడుకు ప్రక్రియలను తిలకించారు. ఖాదీ పరిశ్రమ వైవిధ్యం తమను ఎంతో ఆశ్చర్యపరచిందని పేర్కొన్నారు. మొత్తం 58మంది విద్యార్థులు ఈ విద్యా అధ్యయన పర్యటనలో పాల్గొన్నారు. వర్సిటి అసోసియేట్ ప్రొఫెసర్ పట్నాయక రవీంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్ గుడ్ల హేమ, ఫేకల్టీ జస్వంత్ పాల్గొన్నారు. వీరికి ఖాదీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు జి.కె.ప్రసాద్, దండా వెంకటరమణ, ఉద్యోగులు జల్లేపల్లి శంకర్రావు, వాండ్రంగి నరేష్ తదితరులు వివరించారు. తొలుత గీతం వర్సిటీ విద్యార్థులు బుడితి ఇత్తడి,కంచు పరిశ్రమను పరిశీలించారు. అక్కడ ప్రముఖ వృత్తి కళాకారుడు కృష్ణారావుతో ఇంటర్వ్యూ జరిపారు.



## జెసీఐ సేవలు అమోఘం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమాజ సేవతోపాటు యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ అందిస్తున్న సేవలు అమోఘమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని కృష్ణాపార్కు జంక్షన్‌లో ఉన్న రోయల్‌ప్లాజా ఫంక్షన్‌హాల్‌లో జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ శ్రీకాకుళం మెయిన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం వ్యవస్థాపక అద్యక్షుడు జామి భీమశంకర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ సమాజసేవే పరమావధిగా జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ శ్రీకాకుళం మెయిన్ పనిచేస్తోందనిచెప్పారు. 1986లో ఏర్పడిన జేసీఐ నలభై ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. జేసీఐ వ్యవస్థాపకుడు భీమశంకర్ మాట్లాడుతూ సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. మున్ముందు మరింతగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. తాను ఆంధ్రా యూనివర్శిటీ సిండికేట్‌గా నియామకం కావడానికి జేసీఐయే కారణమన్నారు. తాను అనేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసి వాటిని అభివృద్ధిపథంలో నడపగలుగుతున్నానంటే అది జెసీఐ అందించిన విధి నిర్వహణ పట్ల చిత్తశుద్ధి, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సమయపాలన అని పేర్కొన్నారు. జెసీఐ అధ్యక్షులు కూన అనీల్ కుమార్ మాట్లాడుతూ తాను జెసీఐ పట్ల ఎంతో నిబద్ధతతో చేస్తున్న సేవా కార్యక్రమాలను మెచ్చి డాక్టర్ జామి భీమ

**- భవిష్యత్‌లో మరిన్ని సేవలు కొనసాగించాలి**
**- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్**

శంకర్ రెండోసారి తనకు అధ్యక్షునిగా ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో కూడా కార్యవర్గ సభ్యులందరితో సమన్వయం చేసుకుంటూ జెసీఐ ఏర్పరుచుకున్న లక్ష్యాలను సాధించేలా కృషి చేస్తానని తెలిపారు. జెసీఐలో 127 దేశాలకు చెందిన ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారని వివరించారు. జెసీఐ సేవా కార్యక్రమాలతో పాటు యువతతో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని వారిని సమాజంలో ఉన్నతంగా తీర్చిదిద్ది వారిని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడం లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా 100 రోజుల్లో వంద మొక్కలు నాటడం, ఆత్మహత్యల నివారణ, రోడ్డు భద్రతా నియమాలు, రక్తదాన శిబిరాలు, అవయవదానంపై అవగాహన కార్యక్రమాలకు సంబంధించి తీర్మాణాలు చేస్తూ పోస్టర్లను జెసీఐ ప్రతినిధులు ప్రారంభించారు. అనంతరం జేసీఐ శ్రీకాకుళం నూతన అధ్యక్షునిగా కూన అనిల్ కుమార్, కార్యదర్శిగా తమ్మినేని ఉషా రాణి, కోశాధికారిగా బొడిగి మధు, ఉపాధ్యక్షులుగా జామి హరీష్, వై.హేమంత్, ఆర్.శ్రీనివాసరావు, జె.కళ్యాణి, టి.మణికంఠ, సంయుక్త కార్యదర్శులుగా కె.జయకృష్ణ, ఐ.లావణ్య, సాయికృష్ణ, డైరెక్టర్లుగా జె.కృష్ణకాంత్, స్వాతి, డా.సింధూర, ఎ.సంతోష్, ఎం.పోషక కుమార్, ప్రభాసూర్య, పీఆర్ మార్కెటింగ్ ఆకుల కృష్ణ, పద్మభూషణ్ సాయి, శివతేజ, ట్రైనింగ్ ఏరియా రాజశేఖర్, జె.మనీష్, కల్చరల్ ఏరియా ఆర్. జగదీష్, డి.నరేంద్ర, మెడికల్ ఏరియా కె.కిరణ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు జోన్ అధ్యక్షులు ఎ.సంతోష్ శివకుమార్, జాతీయ మాజీ కోఆర్డినేటర్ వి పవన్ కుమార్, జోన్ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, జోన్ కో-ఆర్డినేటర్ బెందాళం వరలక్ష్మీ, శివకుమార్, టీడీపీ నాయకులు అంధవరపు సంతోష్, పలు స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, నటుకుల మోహన్, జేసీఐ కోలామ్ ప్రెసిడెంట్స్ అర్జున్, ప్రవీణ్, రమ్య, ఉమేష్, శ్రావణ్, రాజగోపాల్, వెంకటరమణ, శ్రీనివాస్, పొన్నాడ రవికుమార్, దూసి సంతోష్, జోన్ ఆఫీసర్స్ దిలీప్, ప్రవీణ్, మణికంఠ, మణిశర్మ, ట్రాఫిక్ జామ్ శ్రీను, శాసపు జోగినాయుడు, గేదెల ఇందిరాప్రసాద్‌లు పాల్గొన్నారు.

## అపోహాలు వీడి యువత రక్తదానం చెయ్యాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


అపోహాలు వీడి యువత రక్తదానం చేయాలని, రక్తకొరతలేని శ్రీకాకుళం కావాలని జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ అధ్యక్షులు సింగూరు ప్రవీణ్‌కుమార్ గురువారం అన్నారు. జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని స్థానిక డే అండ్ నైట్ కూడలి వద్ద గల విజయశ్రీ రక్తనిధి కేంద్రంలో మేనేజర్ డోకి శ్రావణ్‌కుమార్ సహకారంతో నిర్వహించారు. జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ అధ్యక్షులు సింగూరు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అధ్యక్షులుగా తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించారని, ఇందులో భాగంగా ఈ ఏడాది సుమారు వెయ్యి యూనిట్ల రక్తాన్ని సేకరించి రక్త కొరతలేని జిల్లాగా నిలపాలన్నదే ధ్యేయమన్నారు. అలాగే ప్రజలకు ముఖ్యంగా యువతకు అవసరమైన అవగాహన కార్యక్రమాలను చేపడతామని, జేసీఐ మెయిన్ వ్యవస్థాపకులు జామి బీమశంకర్, జేసీఐ సన్‌రైజర్స్ వ్యవస్థాపకులు దూసి సంతోష్, పాస్ట్ ప్రెసిడెంట్ జేసీ డాక్టర్ వినోద్ ఇతరసభ్యులను కలుపుకుంటూ నిరంతర సేవా కార్యక్రమాలతో జేసీఐ సన్‌రైజర్స్‌తో ముందుకు వెళ్తామన్నారు. ఈ రోజు రక్తదానంలో తాను కూడా భాగమయ్యానని, ఇందులో భాగంగా జేసీఐ సన్‌రైజర్స్ వైస్ ప్రెసిడెంట్ షర్మిల తన రక్తపు సిరాను అందించి అందరిలో స్ఫూర్తి నింపారని, అతివ అయి ఉండి కూడా రక్తదానానికి ముందుకురావటం హర్షణీయమన్నారు. అనంతరం రక్తదాతలైన షర్మిల, శ్రీనివాస్, సురేష్, సూర్యనారాయణ, ప్రవీణ్ కుమార్ సింగూరు, బగాది ప్రవీణ్, జగదీష్, దూసి సంతోష్, భరత్‌కుమార్, శ్రీకాంత్, వెంకటేష్ తదితరులను రక్తనిధి కేంద్ర మేనేజర్ డోకి శ్రావణ్ సత్కరించారు. కార్యక్రమంలో జోన్ ప్రెసిడెంట్ సంతోష్, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, జోన్ డైరెక్టర్ కమ్యూనిటీ డెవలప్మెంట్ దిలీప్‌కుమార్, పూర్వ అధ్యక్షులు బగాది ప్రవీణ్ కుమార్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర పిలుపులో భాగంగా పలాస ప్రతినిధులు గురువారం తహశీల్దార్‌కు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, విజయ్ రవికుమార్‌లు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, పలాస

## బాలసరస్వతికి ఘన సన్మానం




(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన రచయిత్రి శ్రీమత్కందాళ బాలసరస్వతి హైదరాబాద్‌లోని వనస్థలిపురం శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ప్రఖ్యాత ప్రవచనకర్త, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు చేతుల మీదుగా ఘన సన్మానం అందుకున్నారు. ఈనాడు దినపత్రిక అంతర్యామి శీర్షికలో ఆధ్యాత్మిక వ్యాసాలు రాస్తున్న రచయితలను ఆధ్యాత్మిక సేవకులైన లగిశెట్టి బాలేశ్వర్, శకుంతల దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఆదిశంకరాచార్యులు విరచిత సౌందర్యలహరిలోని అంశాలను బాలసరస్వతి తన వ్యాసాలలో అద్భుతంగా ఆవిష్కరించారని వక్తలు కొనియాడారు. సన్మానగ్రహీతను దుశ్శాలువతో సత్కరించిన పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ఆమెకు రూ.పదివేల నగదు, మెమెంటో అందజేశారు. ఇచ్ఛాపురంలో బీ.కాం, శ్రీకాకుళంలో బీఈడీ చదివిన బాలసరస్వతి రాసిన కథలు ఈనాడు ఆదివారం మేగజైన్‌లోను, స్వాతి వార, మాస పత్రికల్లోనూ, ఆంధ్రభూమి దిన, వార, మాస పత్రికల్లోనూ, వివిధ డిజిటల్ మాగజైన్లలోనూ ప్రచురితమయ్యాయి. ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మున్సిపల్ బాలికోన్నత పాఠశాలల్లో విద్యా వాలంటీరుగాను, శాంతినికేతన్, రవీంద్రభారతి పాఠశాలల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేసిన బాలసరస్వతికి చిన్నారులకు నైతిక విలువలు నేర్పడం అంటే ఎంతో ఇష్టం.

## పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం పట్టణంలో మౌలిక సదుపాయాలు చాలా తక్కువగా ఉన్నాయని అందువల్ల అభివృద్ధి ప్రధాని లక్ష్యంగా పనిచేస్తున్నామని మరింత సర్వాంగ సుందరంగా పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తానని శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ తెలిపారు. పట్టణంలోని న్యూకాలనీ వాసులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూ కాలనీ వాసులంతా ఎమ్మెల్యేకు సత్కరించారు. ఎంతో ప్రతిష్టాకరమైన జిల్లాకు పేరు తీసుకువచ్చే అరసవిల్లి రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడంలో అత్యంత కీలక పాత్ర పోషించారని ఈ ఉత్సవాలు రాష్ట్ర పండగ జరపడం జిల్లా ప్రజలకు ఎంత గొప్ప విషయం అని న్యూకాలనీ వాసులు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా, పట్టణం అభివృద్ధి పథలో నడుస్తుందని న్యూకాలనీవాసులు ప్రశంసించారు ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పట్టణ ప్రజల అభిమానం పట్టణానికి మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని వాటి నియంత్రించవలసిన అవసరం ఉందని తెలిపారు. న్యూ కాలనీ అంటే పట్టణానికే ఎప్పుడు కొత్తదనంగా ఉండాలని ఆ విధంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు అంతేకాకుండా నిరంతరం ప్రజల సమస్యలు పరిష్కరించడం పట్టణ అభివృద్ధి ప్రత్యేక దృష్టి పెట్టడం తమ ముందు ఉన్న ప్రధాన సమస్యలను వాటిని అధిగమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూ కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీగా రఘువర్మ గెలుపు ఖాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గెలుపు కోసం ఉపాధ్యాయ వర్గాలు, కూటమి నేతలు ముమ్మరంగా కృషి చేస్తున్నారని, ఆయన గెలుపు సునాయాసమేనని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపట్ల అవగాహన కలిగి, వాటి పరిష్కారానికి పోరాట పటిమ రఘువర్మకే సాధ్యమన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలలో మొత్తం 4289 ఉపాధ్యాయ ఓటర్లుకు గాను 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రతీ మండలకేంద్రంలో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారని, శ్రీకాకుళం పట్టణంలో మాత్రం రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో 1439 ఓటర్లు, ఆమదాలవలసలో 608, నరసన్నపేటలో 430, టెక్కలిలో 507, ఇచ్ఛాపురంలో 440, పలాసలో 517, పాతపట్నంలో 555, ఎచ్చెర్లలో 333 ఉపాధ్యాయ ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకుంటున్నారన్నారు. కూటమి అభ్యర్థి గెలుపు కోసం టీడీపీ శ్రేణులు అందరూ కృషి చేయాలని కోరారు.

## పర్యటనలు తప్ప ప్రజా సమస్యలు పట్టవా?

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికి పర్యటనలు తప్ప ప్రజా సమస్యలు పట్టడం లేదని నగర టీడీపీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ ఆరోపించారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్మోహనరెడ్డికి అధికారంలో ఉన్నపుడు రైతులు, రాష్ట్ర ప్రజలు గుర్తుకు రాలేదని, ఇప్పుడు అధికారం కోల్పోయాక వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు, ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్న విషయం జగన్మోహనరెడ్డి గుర్తెరగాలన్నారు. ఎన్నికల కోడ్ సమయంలో పర్యటనలు చేయకూడదని అధికారులు చెప్పినా దౌర్జన్యంగా పర్యటనలు చేస్తుండడం ఎంతవరకు సమంజసమన్నారు. వైకాపాయే కనుక ప్రజారంజక పాలన సాగించి ఉంటే నేడు ప్రతిపక్ష హోదా అడుక్కునే స్థాయికి దిగజారి ఉండేది కాదన్నారు. వైకాపా అధినేత ఇప్పటికైనా చౌకబారు ఆరోపణలు మానుకుని ఏదైనా సమస్యలపై స్పందించాలనుకుంటే అసెంబ్లీకి వెళ్లి అక్కడ చర్చల్లో పాల్గొనాలన్నారు. అసలు వైకాపా పాలనలో ఎవరికీ ఎటువంటి లబ్ది చేకూరలేదన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించే జగన్‌ను గద్దె దించారన్నారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

# తత్వం బోధపడిందా సామీ!

(మొదటిపేజీ తరువాయి)

పెద్దగా స్పందన కనిపించినట్టు లేదు. అయితే జగన్మోహన్‌రెడ్డికి జనంలో ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని వేరేగా చెప్పనక్కర్లేదు. ఒకరు పిలుపునిస్తే రావడానికి, ఇవ్వకపోతే మానేయడానికి జనంతో జగన్‌కు వచ్చిన గొడవ ఎప్పుడూ లేదు. వల్లభనేని వంశీని పరామర్శించడానికి వెళితే, మిర్చియార్డు రైతుల వద్దకు వెళితే జనం పోటెత్తేశారు. అంటే.. జనంలో జగన్ ఇంకా పల్చబడ లేదన్న సంకేతాలు సజీవంగానే ఉన్నాయని అర్థమవుతుంది. ఇటువంటి సమయంలో పార్టీతో లేకపోతే జగన్మోహన్‌రెడ్డి ఎవర్నయినా వదులుకోడానికి సిద్ధంగా ఉంటారన్న విషయం స్పష్టమవుతుంది. తన ఆర్థిక గుట్టుమట్టులన్నీ తెలిసిన విజయసాయిరెడ్డి వెళ్లిపోతేనే ఎందుకు, ఏమిటి అని జగన్మోహన్‌రెడ్డి అడగలేదు. అలాంటిది ఇప్పుడు ధర్మాన అలకబూనారని తెలుసుకున్న తర్వాత పాలకొండలో కనపడకపోతే కచ్చితంగా నియోజకవర్గంలో మరో నాయకుడ్ని తెచ్చిపెట్టడం ఖాయం. రాజకీయం ఒక వ్యసనం. ధర్మాన లాంటి వారు ప్రతీ ఎన్నికలోనూ తనకు ఇదే చివరి ఎన్నికంటూ, జనానికి అక్కర్లేకపోతే దుకాణం సర్దేస్తానని చెబుతుంటారు. కానీ గెలుపు ఓటమిలతో సంబంధం లేకుండా పోటీ చేస్తుంటారు. ఎప్పట్లాగే తాను మెట్టు దిగకుండా తన కొడుకుతో ఈ కార్యక్రమం నడిపించాలని ధర్మాన భావించారు. కానీ ఇంతలోనే సీన్ మారిపోయింది. పార్టీ అధికారం కోల్పోయినా జిల్లాలో మిగిలిన సీనియర్లు కూడా అసంతృప్తితో ఉండటం వల్ల ధర్మాన అలిగారని తెలిసినా పార్టీ బుజ్జగిస్తూ వచ్చింది. అందుకు కారణం.. ఆయన సోదరుడు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉండటమే. జగన్మోహన్‌రెడ్డితో సమావేశం కావాల్సిన సందర్భంలో ప్రసాదరావు డుమ్మాకొట్టినా ఆరోగ్య కారణాలో, మరో కారణాలో అక్కడ చూపించి తమ్ముడ్ని కాచుకుంటూ వచ్చారు. కానీ గడిచిన పది రోజులుగా ప్రసాదరావు ప్రభావం వల్ల కృష్ణదాస్‌ను జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పిస్తారన్న ప్రచారం ఊపందుకుంది. సొంత తమ్ముడినే పార్టీలో యాక్టివేట్ చేయని కృష్ణదాస్ వల్ల ఉపయోగం లేదనే వాదన బలంగా వినిపించింది. ఆయన్ను తప్పిస్తారని ప్రచారం జరిగిన తర్వాత కూడా ఈ విషయంలో జగన్ వెనక్కు తగ్గలేదని భోగట్టా. ఇన్నాళ్లూ ఎమ్మెల్యేలుగా ఓడిపోయినా పార్టీ అధ్యక్ష పదవి తమ ఇంటిలోనే ఉంది కాబట్టి నెట్టుకొచ్చిన ధర్మాన ఇప్పుడు కృష్ణదాస్‌ను కూడా అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పిస్తే జిల్లా వేరేవారి చేతికి వెళ్లిపోతుందన్న భావనతోనే తన సహజసిద్ధమైన బింకాన్ని విడిచి జగన్మోహన్‌రెడ్డిని కలిశారు. ఎందుకంటే.. తన కుమారుడి సర్జరీ అనంతరం ఆమదాలవలస నియోజకవర్గంలో తమ్మినేని సీతారాం అలకవీడి పార్టీ నేతలతో మాట్లాడుతున్నారు. మరోవైపు మాజీమంత్రి సీదిరి అప్పలరాజు నుంచి ధర్మాన ప్రసాదరావుకు ఎప్పటికైనా పదవి పరంగా త్రెట్ ఉంటుంది. ఈ విషయం ధర్మానకు తెలియంది కాదు. ఇప్పటికే ఆయన మనోభీష్టం మేరకు జిల్లాలో అనేక మార్పులు, చేర్పులు చేశారు. ఇక దువ్వాడ శ్రీనివాస్ లాంటివారు పొగబెట్టకుండానే పోయారు. ఇప్పుడు కూడా ధర్మాన పార్టీలో చురుగ్గా వ్యవహరించకపోతే జగన్మోహన్‌రెడ్డే తనను తోడ్కొని వెళ్లాలని భావిస్తే పార్టీ మరో నాయకత్వాన్ని వెతుక్కుంటుందన్న విషయం తెలియనంత జూనియర్ కాదు ధర్మాన ప్రసాదరావు. ఎన్నికల తర్వాత కేడర్ ఏమైపోయిందో కనీసం పట్టించుకోని ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు ఇప్పుడు జగన్ పర్యటకు పిలుపునివ్వడంపై శ్రేణులు పక్కున నవ్వుకున్నాయి. అందుకే ఈ బాధ్యతను స్వయంగా ధర్మానే భుజాల మీద వేసుకొని జగన్మోహన్‌రెడ్డి వద్దకు తరలివెళ్లారు. కొసమెరుపు ఏటంటే.. ఈ కార్యక్రమానికి చిన్ని వెళ్లలేదు.

# సర్ పాత్రో జీవిత చరిత్ర ఎంతో ఆదర్శం

## - పుస్తక ఆవిష్కరణ సభలో మాజీ ఎంపీపీ కూన ప్రమీల -



సత్యంన్యూస్, శ్రీకాకుళం

ఆధునిక సమాజంలో సంస్కరణలకు ఆద్యుడుగా పేరొందిన సర్ రావు బహుదూర్ అన్నెపు పరశురాం పాత్రో జీవితచరిత్ర అందరికీ ఆదర్శమని మాజీ ఎంపీపీ కూన ప్రమీల అన్నారు. కళింగ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కొత్తరోడ్డులోని శాంతి కన్వెన్షన్‌లో పుస్తకావిష్కరణ ఆహ్వాన కమిటీ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించిన సర్ రావు బహుదూర్ అన్నెపు పరశురాం పాత్రో పుస్తకావిష్కరణ సభలో ఆమె మాట్లాడారు. పాత్రో జీవిత చరిత్రను నేటి సమాజానికి, భవిష్యత్తు తరాలకు అందించాలని సంకల్పించిన రచయత గూన అప్పారావును అభినందించారు. పుస్తకాన్ని ఆవిష్కరించి అందరికి అందుబాటులో తీసుకురావడానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. స్వతంత్రానికి ముందు 1923లో మద్రాస్ ప్రెసిడెన్సీలో విద్యాశాఖ మంత్రిగా పరశురాం పాత్రో ఉంటూ విశాఖలో ఆంధ్రా యూనివర్శిటీని ఏర్పాటుచేశారని గుర్తుచేశారు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా మద్రాస్ ప్రెసిడెన్సీలో బిల్లు పెట్టి రిజర్వేషన్లు అమలుచేసింది పరశురాం పాత్రోయేనని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు విద్యాసంస్థల్లో అమలు చేయించడంలోనూ కృషి చేశారన్నారు. బ్రాహ్మణిజానికి వ్యతిరేకంగా జస్టిస్ పార్టీని ఏర్పాటుచేసి తమిళనాడు సంఘ సంస్కర్త పెరియర్ రామస్వామి వంటి అనేకమందితో కలిసి మనువాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చి ముత్తు లక్ష్మీరెడ్డిని పోటీ చేయించి మొదటి మహిళా ప్రజాప్రతినిధిగా పరశురాం పాత్రో గెలిపించారని తెలిపారు. నిమ్న వర్గాలుగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలను క్రిమినల్ ట్రైబల్ యాక్ట్ నుంచి విముక్తి కలిగించి క్రిమినల్ ట్రైబల్ యాక్ట్ రద్దు చేయించారని గుర్తు చేశారు. క్రిమినల్ ట్రైబల్‌గా గుర్తించబడిన 246 తెగలే నేడు బీసీ, ఎస్టీ, ఎస్సీగా స్వతంత్ర అనంతరం రిజర్వేషన్లు పొందుతున్నారని వివరించారు. గూన అప్పారావు చారిత్రాత్మకమైన అంశాలు వెలికితీయడంలోనూ అధ్యయనం చేయడంలోనూ భావితరాలకు అందించడంలోనూ మంచి కృషి చేశారన్నారు. ముందుగా పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రచురణలను అందరికీ అందించారు. అనంతరం విశిష్ట, ముఖ్య అతిథిలను, పుస్తక రచయత గూన అప్పారావుతో పాటు, పుస్తక ఆవిష్కరణ ఆహ్వాన కమిటీ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తితో పాటు సభ్యులను దుస్సాలువతో సన్మానించారు. కార్యక్రమానికి ప్రముఖులు మాజీ సెషన్స్ అండ్ జిల్లా న్యాయమూర్తి పప్పల జగన్నాధరావు, మాజీ వైస్ ఛాన్సలర్ హనుమంతు లజపతిరాయ్, మాజీ ఐఏఎస్ సూర బాలకృష్ణరావు, జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ మెంబర్ బి.వి.ఎస్.ఎన్.రాజు, ప్రొఫెసర్ గుంట లీలావరప్రసాద్, దుప్పల రవికుమార్, డాక్టర్ పి.సూర్యం, గురుగుబెల్లి నాగరాజు, కొంక్యాన వేణుగోపాలరావు, బుడుమూరు శ్రీరాంమూర్తి, బాడాన దేవభూషణ్, అన్నెపు సూర్యనారాయణ, బుడుమూరు సూర్యారావు, డాక్టర్ బొడ్డేపల్లి రమేష్, సీపాన రామారావు, బగాది నారాయణరావు, బి.శ్రీరామమూర్తి, బొడ్డేపల్లి మోహనరావు, మెట్ట అన్నాజీ భట్లు, డాక్టర్ అన్నెపు శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకరి పెళ్లాం ఇంకొకరి మొగుడితో లేచిపోవడమే లేటెస్ట్ ఫ్యాషన్

మొదటిపేజీ తరువాయి

కనీసం పరువు ప్రతిష్ఠ అని సిగ్గుపడుతున్నారా అంటే అదీ లేదు. సుబ్బరంగా ఫోటోషూట్ తీసి సోషల్ మీడియాలో పెడుతున్నారు. పైగా ఆ దరిద్రాలను పబ్లిక్ చేస్తున్నారు.

ఎటుపోతుంది వైవాహిక వ్యవస్థ? నాలుగు గోడల మధ్య పరిష్కారం చేసుకోవాల్సిన ఫ్యామిలీ విషయాలు బజారున పడేసుకోవడం లేదూ?

ఆ మధ్య భార్య మీద అలిగి సినీ నటుడు నరేష్ క్యారక్టర్ ఆర్టిస్టు వివాహిత అయిన పవిత్రతో ఏకంగా బెంగుళూరులో ఓ హోటల్ రూంలో నైట్ స్టే చేసి ఈ విషయాన్ని కావాలనే భార్యకు తెలిసేలా చేసి నానా అల్లరి చేసుకున్నాడు. అదో ఆనందం..!

ఈ లేచిపోవడాల స్టోరీ అంతా టీవీల్లో డైలీ ఎపిసోడ్లు టెలీకాస్ట్ అయ్యాయి కూడా. అది అయ్యింది అనుకునే లోపు దువ్వాడ ఎపిసోడ్ మొదలైంది. పెళ్లయి పెళ్లాం పిల్లలు ఉన్న దువ్వాడ శ్రీను (పైగా ఎమ్మెల్సీ కూడా) ఇంకొకరి భార్యతో రిలేషన్ షిప్‌లో ఉన్నాడని ఆయన భార్య ఇంటిముందు నిరాహార దీక్ష కూడా చేసింది.

చట్ మా ఇద్దరి మధ్య అలాటిది ఏమీ లేదు.. కేవలం అడల్టరేషన్ స్నేహం మాత్రమే ఉందని కొత్త అర్థం చెప్పింది ఆ ఇంకొకరి భార్య దివ్వెల మాధురి.

అమెరికాలో ఉన్న మాధురి భర్తను మీడియా వాళ్లు అడిగితే మా అవిడ చెప్పింది నిజమే.. అంతేగా అంతేగా అన్నాడు (వదిలించుకుందాం అనుకునేవాళ్లు లేటెస్టుగా ఈ ఫార్ములా ఫాలో అవుతున్నారు)

సరే ధనం మూలం ఇదం జగత్ అన్నారు కదా.. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని ఆ రష్యా ఆయన ఎప్పుడో చెప్పేశాడు కదా.. డబ్బుతో పరిష్కారం కానిది ఏముంటుంది? సెటిల్ అయ్యింది.. కథ సుఖాంతం అయ్యింది. మళ్లీ ఇన్నాళ్లకు.. పడక పడక ఆ దిక్కుమాలిన వీడియో నాకంట పడాలా?

మొన్న వాలంటెన్ డే సందర్భంగా లేటు వయసులో ఘాటు ప్రేమికులు దువ్వాడ శ్రీను.. దివ్వెల మాధురి తమ ముదర ప్రేమకు గుర్తుగా నలుగురినీ పిలిచి కేక్ కటింగ్ చేశారు. కేక్ కట్ చేస్తే చేశారు.. ఆవిడగారు ఆయన గారికి ముద్దు కూడా పెట్టేశారు.. పైగా ఓ యూట్యూబ్ ఛానెల్ వారిని పిలిచి మరీ తమ ప్రేమను లైవ్‌లో పెట్టేశారు. పెడితే పెట్టారు.. దువ్వాడ శ్రీనుతో పిల్లల్ని కనాలని ఉందని ఆవిడ గారు మనసులో మాట బయటపెట్టింది.

అప్పుడు అర్థమైంది నాకు.. ఓహో అవిడ చెప్పిన అడల్టరేషన్ స్నేహం అంటే ఇదా అని. ఇక ఆ నరేష్ గారైతే ఏకంగా కొత్త ఫార్ములా చెప్పేశారు.. ఈ వయసులో పిల్లల్ని ప్లాన్ చేసుకుంటే తనకు ఎన్నేళ్లు వస్తే పిల్లవాడు పెరిగి చేతికి అంది వస్తాడో లెక్కలు వేసి మరీ చెప్పాడు. ఆ మాథమేటిక్స్ చూసి వార్నీ అనుకున్నా.

అన్నట్టు ఈ రెండు స్టోరీలు చూసి ఇన్‌స్పైర్ అయినట్టు ఉన్నారు గుంటూరుకు చెందిన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ గారు. వారు కూడా ఇంకొకరి భార్యతో అడల్టరేషన్ స్నేహంలో ఉండగా.. ఆయన భార్య రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీస్ కంప్లయింట్ ఇచ్చిందట. ఇప్పుడు టీవీల్లో వస్తుంది. ఇంకో స్టోరీ మొదలైంది. పర్లేదు కొత్త ఫార్ములాని జనం బానే ఫాలో అవుతున్నారు. సెకండ్ హ్యాండ్లకు గిరాకీ బానే ఉంది! ఎందుకో ఈమధ్య స్లో అయ్యాడు కానీ.. లేకపోతేనా రామ్‌గోపాల్ వర్మ ఈ రెండు స్టోరీలు కలిపి ఓ సినిమా తీసి చూస్తే చూడండి లేకపోతే మీ ఖర్మ అని జనం మీదికి వదిలేవాడు. అదీ సంగతి..

# సంపన్నులే పాలకులైతే..!

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించిన నినాదమన్నమాట. ఆ నినాదానికి అనుగుణంగానే పారిస్ పర్యావరణ ఒప్పందం నుంచి అమెరికా వైదొలగింది. ట్రంప్ తన మొదటి దఫా అధికారంలో ఉన్నప్పుడు ఆమోదించిన టాక్స్ కట్, జాబ్ చట్టం ద్వారా అమెరికాలోని అత్యంత సంపన్నులకు 85 శాతం పన్ను రాయితీలు దక్కాయి. ఈ చర్యల వలన ప్రభుత్వ లోటు పెరగటమే కాక వివిధ జాతులకు చెందిన వారి మధ్య వార్షికాదాయ అంతరాలు ఘోరంగా పెరిగిపోయాయి. సరసమైన ధరలకే వైద్య సదుపాయం చట్టాన్ని సవరించటంతో ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతల్లో ఉన్న కాలంలో వైద్య ఆరోగ్య సేవలు దారుణంగా పెరిగిపోయాయి.

అంతులేని స్థాయిల్లో శక్తులను సమకూర్చుకున్న మార్కెట్‌లకు అడ్డుఅదుపూ లేని అవకాశాలు కల్పించేందుకు వీలుగా తెరమీదకు వచ్చిన నయా ఉదారవాద విధానాల (రీగకానమిక్స్) వ్యక్తీకరణకు పరాకాష్ట రూపమే ట్రంప్ అని చెప్పవచ్చు. నయా ఉదారవాద విధానాల ఫలితాలు కూడా మన కళ్లముందున్నాయి.

అయితే, సంక్లిష్టతల గురించి పరిశోధనలు చేసే శాస్త్రవేత్త పీటర్ టర్చిన్ చెప్పినట్లు, 1983 నాటికి 10 మిలియన్‌ల కంటే ఎక్కువ ఆస్తులున్న కుటుంబాలు 66వేలు మాత్రమే. 2019 నాటికి ఇటువంటి కుటుంబాల సంఖ్య 6,93,000. అంటే పదిరెట్లు పెరిగాయి. అంటే నయా ఉదారవాద విధానాల కాలంలో సంపన్నుల తయారీ రేటు అనూహ్యంగా పెరిగింది. (ఆర్థిక వ్యవస్థలో వృద్ధి రేటు కంటే ఎన్నో రెట్లు ఎక్కువ). దాంతోపాటు ఈ కాలంలోనే సంపన్నుల రాజకీయాల్లోకి ప్రవేశించటం వేగవంతమైంది.

ఎకనమిక్ పాలసీ ఇనిస్టిట్యూట్ అధ్యయనం ప్రకారం 1945 నుంచి 1973 వరకూ దేశ ఆర్థికాభివృద్ధి రేటుతో సమానంగా కార్మికుల వేతనాలు పెరుగుతూ వచ్చాయి. కానీ 1973 తర్వాత పరిస్థితులు మారిపోయాయి. 1974 నుంచి 2013 మధ్యకాలంలో ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదకత 74 శాతం పెరిగితే కార్మికుల వేతనాలు మాత్రం తొమ్మిది శాతమే పెరిగాయి. ఆ కాలంలో మధ్యతరగతి వేతనాలు స్తబ్దతకు లోనయ్యాయి. దిగువ తరగతి కార్మికుల వేతనాలు ఐదు శాతం పడిపోయాయి. ఉన్నత ఆదాయ వర్గాల వేతనాలు 41 శాతం పెరిగాయి. 1965 నాటికి అమెరికాలో శక్తివంతమైన 350 కంపెనీల ప్రధాన కార్యనిర్వహణాధికారుల వేతనాలు సాధారణ కార్మికుల వేతనాల కంటే 20 రెట్లు పెరిగాయి. 2000 తర్వాతి కాలంలో ఈ ఉన్నతోద్యోగుల వేతనాల్లో పెరుగుదల సాధారణ కార్మికుల వేతనాల పెరుగదల రేటు కంటే 384 రెట్లు పెరిగింది. అమెరికాలో సగటు నిజవేతనం 2013 కంటే 1965లోనే ఎక్కువగా ఉంది.

రాజకీయ నిస్వార్థిత సమస్య

అమెరికాలో దారిద్ర్యంలోకి కూరుకుపోతున్న కార్మికులు ఓ వైపునా, ఆకాశాన్నంటుతున్న సంపద శిఖరాలు మరోవైపునా పెరిగిపోతూ వచ్చాయి. ఈ విషయంలో రెండు పార్టీల మధ్యా, వారి విధానాల్లోనూ ఎటువంటి తేడా లేదు. 14మంది శత కోటీశ్వరులు ట్రంప్ కోసం చందాలిస్తే 21 మంది కమలా హారిస్‌కు చందాలిచ్చారు. తొలి ట్రంప్ క్యాబినెట్‌లో భాగస్వాముల ఉమ్మడి ఆస్తులు 6.2 ట్రిలియన్ డాలర్లు అయితే ఒబామా రెండోసారి అధికారానికి వచ్చిన తర్వాత ఒబామా కూర్చిన మంత్రిమండలిలోని సభ్యుల ఉమ్మడి ఆస్తుల విలువ 2.8 ట్రిలియన్ డాలర్లు. ట్రంప్ తొలి పాలనలో కార్పొరేట్ లాభాలు 2 ట్రిలియన్లు దాటితే ట్రంప్‌ను ఓడించి అధికారానికి వచ్చిన బైడెన్ పాలనా కాలంలో ఈ లాభాలు 3.7 ట్రిలియన్ డాలర్లకు చేరాయి. ఇక్కడ విచిత్రమైన పరిస్థితి ఏమిటంటే కార్మికుల్లో అత్యధికులు ట్రంప్‌కు ఓటు వేస్తే డిగ్రీ పట్టా పుచ్చుకున్న వారిలో అత్యధికులు కమలా హారిస్‌కు ఓటు వేశారు.

ఆర్థికంగా చితికిపోతున్న పేదలను ఓటుబ్యాంకుగా మార్చుకోవటమే ట్రంప్ ఎన్నికల వ్యూహంలో కలికితురాయి. ఈ చితికిపోతున్న పేదలకు, వారికుండే కోపాలను ఆసరా చేసుకుని జాతివ్యతిరేకత నూరిపోయటానికి, తలకెక్కించటానికి పాలకులు పెద్దగా కష్టపడక్కర్లేదు. ట్రంప్ కూడా అదే చేశాడు. దాంతో వీరంతా ఏదో ఆశతో ఫాసిస్టులు, నయా ఫాసిస్టుల ప్రభావానికి లోనుకావటం, అటువంటి శక్తులను నెత్తికెత్తుకుని ఊరేగించటం మరింత తేలికైంది. 1998లోనే తత్వవేత్త రిచర్డ్ రోర్టీ 'పట్టణేతర ఓటర్లు ఈ వ్యవస్థ విఫలమైందన్న నిర్ధారణకు వస్తారు. దాంతో ఏదో అరివీర భయంకరుడు వచ్చి తమను ఆదుకుంటాడని ఎదురు చూస్తారు. ఆ ప్రయత్నంలో గత నాలుగు దశాబ్దాలుగా నల్లజాతీయులు, ఆసియా వాసులు, ఏకలింగ సంపర్కులు సాధించుకున్న విజయాలన్నీ ఆవిరైపోతాయి.' అని హెచ్చరించారు.

చైనాలో ఇప్పటికే 31 శాతం మంది కుబేరులు పాలనా యంత్రాంగంలో భాగస్వాములు. రష్యాలో 21 శాతం. అమెరికాలో 3.5 శాతం రాజకీయ రంగంలో కీలక స్థానాలాక్రమించారు. అయినా రాజకీయం కుబేరుల క్రీడారంగం కావటం ప్రపంచంలోనే అతి ప్రాచీన ప్రజాస్వామ్య దేశమైన అమెరికా మనుగడకు ముప్పు తేవడమే కాదు. ఈ ప్రమాదం పర్యవసానాలు యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేయనున్నాయి.

# మృతుడు నీలమ్మకాలనీవాసి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



నాగావళి నదిలో లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం శ్రీకాకుళం నగరం తోటపాలెం రోడ్డు జంక్షన్‌లో ఉన్న నీలమ్మ కాలనీవాసి దుండు త్రినాధరావు (45) అలియాస్ హరిగా పోలీసులు గుర్తించారు. ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లిపోయాడని మృతుని భార్య వెంకటలక్ష్మి తెలిపారు. నగరంలోని పీఎస్ఎన్ఎం స్కూల్ వద్ద దుకాణంలో కమ్మరి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతునికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రిమ్స్ మార్చురీ వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా వినాయకం

# బాధ్యతలు స్వీకరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా కుడిమి వినాయకం గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో పలనాడు జిల్లాలో రెవిన్యూ డివిజనల్ అధికారిగా విధులు నిర్వహించారు. ఎస్ఈ కార్పొరేషన్ ఈడీ వినాయకం మాట్లాడుతూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచనలు, సలహాల మేరకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హత కలిగిన ప్రతి ఒక్క లబ్ధిదారునికి అందజేసేలా కృషి చేస్తానన్నారు.

# 400మంది ఇళ్లు కొట్టేయమని ముందుకొచ్చారు

మొదటిపేజీ తరువాయి

బొందిలీపురం మీదుగా బలగ మార్గానికి కలిపే రోడ్డును కూడా వెడల్పు చేస్తున్నట్టు ఎమ్మెల్యే వివరించారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగ చేయడం ఒక సాకుమాత్రమేనని, ఆ పేరిట దేశం మొత్తంలో కదలిక తీసుకువచ్చి నిధులు తెచ్చుకొని నగరాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. రథసప్తమి కోసం నిధులు కావాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్క నిమిషం కూడా ఆలోచించలేదని, ఇప్పటి వరకు ఈ పండగ కోసం రూ.2 కోట్లు ప్రభుత్వం మంజూరుచేసిందని, మరో రూ.కోటి విడుదల చేస్తానని రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి నారాయణ మాటిచ్చారని, దీంతో రథసప్తమి సందర్భంగా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తామన్నారు. న్యూకాలనీలో రోడ్లు ఆక్రమణలకు గురికావడం, వీధి దీపాలు వెలగకపోవడాన్ని కమిషనర్ దృష్టిలో పెట్టానని, ఆయన తిరుపతి నుంచి రాగానే దీనిపై దృష్టి సారిస్తారన్నారు. రోడ్ ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీలు ఈ ప్రాంతాన్ని ఆక్రమించాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వీటిని నగర శివార్లలోకి తరలించేందుకు ప్రయత్నిస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని ఈమధ్యనే అర్థమైందని, ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతరం పోలీస్ బీట్ ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలల్లో అనేక రోడ్లు, కాలువలు నిర్మించామని, వాటిని ప్రారంభించకపోవడం వల్ల బయటకు తెలియడంలేదని, త్వరలోనే సుందరమైన పార్కులు కూడా నిర్మించి నగరానికి శోభను చేకూరుస్తామన్నారు. టీడీపీ నాయకుడు అంధవరపు సంతోష్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి ఎమ్మెల్యే నిరంతరం శ్రమిస్తున్నారని, ఏ సమస్య చెప్పినా గాలికి వదిలేయకుండా దాన్ని నమోదు చేసుకోవడం, వెంటనే పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. రాష్ట్రమంత్రిగా అచ్చెన్నాయుడు విజయవాడలో ఛాంబర్ ప్రారంభించినప్పుడు ఆ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రులు, ఐఏఎస్‌లతో తాను నమోదు చేసుకున్న సమస్యలను ప్రస్తావించి పరిష్కారాన్ని కోరడం కోసం వారిని సతాయించడం స్వయంగా చూశానని, అంతటి చిత్తశుద్ధి ఉందికాబట్టే రథసప్తమి వేడుకలను విజయవంతం చేయగలిగామన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న ప్రసాదం ప్రాజెక్టు ద్వారా అరసవల్లి, శ్రీకూర్మం రూ.100 కోట్లతో అభివృద్ధి చేయడానికి రూట్‌మ్యాప్ సిద్ధమైపోయిందని, ఇందుకోసం ఎమ్మెల్యే కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడును నిరంతరం ఫాలో అయ్యారని చెప్పారు. అనంతరం కాలనీవాసులు ఎమ్మెల్యేకు చిరుసత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు ఎం.ఎస్.వినయ్‌భూషణ్, లంక గాంధీ, కొంచాడ సోమేశ్వరరావు, సురంగి మోహనరావు, అట్టాడ రవిబాబ్జీ, బిర్లంగి ఉమామహేశ్వరరావు, క్రెడాయ్ చక్రవర్తి, ఎస్ఎస్ శ్రీను, లక్ష్మీ బార్ శ్రీను, కిల్లంశెట్టి సురేష్, ఇప్పిలి తిరుమలరావు, బాబూలాల్ పొద్దర్, డాక్టర్ కొంచాడ రవికుమార్, పట్నాల సూరిబాబు, కిల్లంశెట్టి సత్యనారాయణ, తంగుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.